క్లుప్తంగా

నూకాలమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



అమ్మవారి దర్శనానికి కిక్కిరిసిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ తల్లి దర్శనానికి గురువారం భక్తులు పోటెత్తారు. 45 రోజుల పాటు నిర్వహించే జాతరలో భాగంగా ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ బందోబస్తు కల్పించారు. సుమారు 20 వేల మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు.

ఘనంగా ఆదిలక్ష్మి అమ్మవారి తీర్థం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప గ్రామదేవత ఆదిలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవం గురువారం అంగరంగవైభవంగా జరిగింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలు, రంగులతో సుందరాతి సుందరంగా అలంకరించారు. ఉదయం ఆలయ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లి గ్రామాల్లో చిరుతాడిని గరగ నృత్యాలు, తీన్‌మార్ డ్యాన్సులు, భారీ బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చిరుతాడిని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా కోర్లమ్మ జాతర

పెద్దాపురం: మండలంలోని చదలాడ గ్రామదేవత చింతాలమ్మ తల్లి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. మేళ తాళాలు, బాణసంచా నడుమ జాతరను ఆలయ కమిటీ వైభవంగా నిర్వహించారు. చదలాడ, తిరుపతి, ఉలిమేశ్వరం తదితర గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు



వాకతిప్పలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వాకతిప్పలో వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ దాకే రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామ వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.

విద్యార్థులూ.. 25వ తేదీలోగా చేరండి..

కాకినాడ సిటీ: ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి కేటాయించిన 25 శాతం ఉచిత సీట్లుకు ఎంపికైన అభ్యర్థుల జాబితాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల జాబితాను గ్రామ సచివాలయాలు, ఎంఈఓ కార్యాలయాల్లో ఉంచినట్లు తెలిపారు. ఆయా విద్యార్థులు ఈనెల 25వ తేదీలోపు అడ్మిషన్లు పొందాలన్నారు. అన్ని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు సదరు విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్చుకుని ఆయా వివరాలను సంబంధిత ఎంఈఓకు అందించాలని డీఈవో వివరించారు.

బీజేపీని సాగనంపుదాం

కాకినాడ సిటీ: బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ, సీపీఎం కమిటీల పిలుపు మేరకు ఆయా పార్టీల నాయకులు గురువారం స్థానిక దుమ్ములపేటలో పాదయాత్ర నిర్వహించి కరపత్రాలు పంచారు. సీపీఐ నాయకులు తాటిపాక మధు, సీపీఎం నాయకులు ఎం వెంకటరమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల సరకుల ధరలు పెంచుతూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని, ప్రజలు ఇప్పటికైనా కళ్లు తెరిచి మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు జి.లోవరత్నం, ఎ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు యంత్రసాయం

- సాగులో అడుగడుగునా ఆదుకుంటున్న ప్రభుత్వం
- వైఎస్సార్ యంత్ర సేవతో అధిక వ్యయానికి చెక్
- నాట్లు మొదలు కోతల వరకు తోడవుతున్న పథకం



వరి కోత యంత్రం

సామర్లకోట: వ్యవసాయంలో యాంత్రీకరణ అన్నదాతకు ఎంతో లబ్ధి చేకూరుస్తోంది. ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రోత్సహిస్తూ వైఎస్సార్ యంత్ర సేవా కేంద్ర పథకం ప్రవేశపెట్టి సబ్సిడీపై వరి కోత యంత్రాలను అందజేస్తోంది. దీంతో దుక్కి మొదలు కోతల వరకు యంత్రాలతో పనులు చేయిస్తూ అన్నదాత లబ్ధి పొందుతున్నాడు. యంత్రాలతో చేసే పనులతో పోలిస్తే కూలీలతో చేయించే ఏ పనికైనా వ్యయం ఎక్కువే అవుతుంది. ప్రస్తుతం వరి కోతల మీద ఉంది కాబట్టి ఆ విషయానికి వస్తే ఎకరానికి పది మంది కూలీలను పెట్టి కోయిస్తే రూ.7 వేలు చెల్లించాల్సి వస్తుంది. నూర్పిడి వరకు మరో రూ.14 వేల వరకు ఖర్చవుతుంది. మొత్తంగా చూస్తే యంత్రంతో కోతల వల్ల రైతుకు సుమారు రూ.10 వేల వరకు ఆదా అవుతుంది. అయితే కూలీలతో కోతల వల్ల వచ్చే గడ్డి పశువులకు పనిచేస్తుంది. కానీ యంత్రాలతో కోసే గడ్డి పశువులకు ఏమాత్రం పనిచేయదు.

అందుబాటులో యంత్రాలు..

మండల పరిధిలో ఐదు వరి కోత యంత్రాలను, యంత్రానికి రూ.8.8 లక్షల సబ్సిడీతో అందజేస్తోంది. దాంతో ప్రతీ గ్రామంలోను వరి కోత యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రైతుల వద్ద ఉన్న వరి కోత యంత్రాలను ఇతర ప్రాంతాలలోని రైతుల అవసరాలు తీర్చడానికి తరలిస్తున్నారు.

అద్దెతో రుణ వాయిదా చెల్లిస్తున్నాం



దాళ్వా, సార్వా సీజన్‌లలో సుమారు 40 రోజుల పాటు వరి కోత యంత్రానికి పని లభిస్తుంది. దాంతో బ్యాంకు రుణం వాయిదా చెల్లిస్తున్నాం. అన్ సీజన్‌లో యంత్రం సర్వీసు చేసి కోతలకు సిద్ధంగా ఉంచుతున్నాం. – వెలమర్తి బుల్లిరాజు, వరి కోత యంత్రం యజమాని, వీకే రాయపురం

సబ్సిడీపై కోత యంత్రాలు



సబ్సిడీపై వరి కోత యంత్రాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఐదుగురు రైతులు ఒక సంఘంగా ఏర్పడి బ్యాంకులో ఖాతా తెరిచి కనీసం రూ.12.5 లక్షలు తమ వాటాగా చెల్లిస్తే ప్రభుత్వం రూ.8.8 లక్షలు సబ్సిడీ ఇస్తుంది. యంత్రం కంపెనీని బట్టి రూ.22 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఉన్నాయి. మండలంలో 80 శాతం వరకు యంత్రాలతో కోతలు సాగుతున్నాం. – ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

ప్రమాదాల నివారణకు చర్యలు



గొల్లప్రోలు మండలం చెందుర్తి వద్ద హైవే జంక్షన్‌ను పరిశీలిస్తున్న డీటీఆర్‌బీ సీఐ రామచంద్రరావు

పిఠాపురం: జాతీయ రహదారులపై గ్రామాల్లో ముఖ్య కూడళ్లలో ఎక్కువగా జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు డీటీఆర్‌బీ సీఐ పి.రామచంద్రరావు తెలిపారు. గొల్లప్రోలు మండలం 216వ, 16వ నంబర్ జాతీయ రహదారుల్లోని ముఖ్య కూడళ్లను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జాతీయ రహదారుల కూడళ్లలో ఎక్కువగా జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నామన్నారు. కూడళ్ల వద్ద వాహనాల వేగాన్ని నిరోధించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్పీడు బ్రేకర్లు ఏర్పాటుతో పాటు రేడియం స్టిక్కర్లు అంటించిన బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. వాహనదారులు, గ్రామస్తులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఆయన వెంట గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ తదితరులు ఉన్నారు.

పాస్టర్‌పై చర్యలు తీసుకోవాలి



సీఐ దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే, కౌన్సిలర్, దళిత నాయకులు

- బాధితులకు న్యాయం చేయాలి
- సీఐకి దళిత నాయకుల వినతిపత్రం

సామర్లకోట: స్థానిక బలుసులపేటలో చర్చి గోడ కూలి ఇద్దరు మృతి చెందిన ఘటనపై పాస్టర్‌పై చర్య తీసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక సీఐ కె.దుర్గా ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఆ దుర్ఘటనలో పిట్టా అర్జున్, మచ్చా నాగేశ్వరరావులు మృతి చెందగా యడగళ్ల అబ్రహం తీవ్రంగా గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అర్జున్‌కు భార్య నూకరత్నం, రెండో తరగతి చదువుతున్న సంజయ్‌కుమార్, ఒకటో తరగతి చదువుతున్న స్వాతిక ఉన్నారు. మచ్చా నాగేశ్వరరావుకు భార్య కామేశ్వరి, 10వ తరగతి పరీక్షలు రాసిన అపర్ణ, 9వ తరగతి చదువుతున్న సంధ్యలు అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిని ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు నేతల హరిబాబు, పిట్టా సత్యనారాయణ, దళిత సంఘ నాయకులు నేతల శ్రీను, తర్లంపూడి కమల్‌రాజ్ డిమాండ్ చేశారు. వారికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన కన్వీనర్ తుమ్మల బాబులు సంఘీభావం తెలిపి పాస్టర్‌తో చర్చించారు. చర్చలు ఫలించకపోవడంతో కేసు నమోదు చేసి కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐ కె దుర్గాప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. మృతులిద్దరికీ, క్షతగాత్రుడికీ వైఎస్సార్ బీమా పథకం ఉన్నదని నేతల హరిబాబు తెలిపారు.

కొర్లమండ సేవలు అభినందనీయం



వీరభద్రరావు దంపతులను సత్కరించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కొర్లమండ వీరభద్రరావును లయన్స్ క్లబ్ జిల్లా రెండో ఉప గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో అభినందించారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి ఎస్.సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు చిత్తూలూరి వీర్రాజు, కోశాధికారి గిడుతూరి శ్రీనివాసు, మాజీ అధ్యక్షులు కర్రి ఆదినారాయణరెడ్డి తదితరులు కొర్లమండ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు కెబీ ఆనంద్ పాల్గొన్నారు.

హెల్మెట్ తీసి.. ప్రాణాలు విడిచి..



ఊరేగింపుగా అఖిల మృతదేహాన్ని పాయకరావుపేట తరలిస్తున్న సంకల్పం సభ్యులు

అన్నవరం: ఆమె ఉపాధ్యాయురాలు. అంతకు మించి స్వచ్ఛంద సేవకురాలు. అప్పటివరకూ హెల్మెట్ ధరించిన ఆమె రోడ్డు దాటడమే కదా హెల్మెట్ ఎందుకు అనుకున్నారు. ఆ ఒక్క పొరబాటుతో ఆమె ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక బీసీ కాలనీలో అనపర్తి కనకదుర్గా అఖిల (31) ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె సంకల్పం అనే స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత శనివారం పదో తరగతి పరీక్షల ఇన్విజిలేటర్‌గా కత్తిపూడి స్కూల్‌లో విధి నిర్వహణకు వెళ్లారు. పరీక్షల అనంతరం ఆమె మరో ఉపాధ్యాయురాలితో కలిసి భోజనం చేయడానికి హోటల్‌కు వెళ్లేందుకు గాను స్కూటీ మీద రోడ్డు దాటుతుండగా వ్యాన్ ఢీకొంది. ఆ సమయంలో అఖిల హెల్మెట్ ధరించలేదు. వెనుక ఉన్న మరో ఉపాధ్యాయురాలు హెల్మెట్ ధరించడంతో ఆమెకు స్వల్పగాయాలవ్వగా అఖిల తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. అఖిలకు భర్త వాసు, కుమారుడు ఉన్నారు.

మృతదేహం పాయకరావుపేటకు తరలింపు

స్థానిక సంకల్పం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక సభ్యురాలైన అఖిల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ఆ సంస్థ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సంకల్పం సంస్థ సభ్యులందరూ హెల్మెట్లు ధరించి మృతదేహాన్ని ఆమె స్వస్థలం పాయకరావుపేటకు తరలించారు.



మృతురాలు అఖిల (ఫైల్)

రత్నగిరిపై అమ్మవార్లకు హోమాలు



రత్నగిరిపై కనకదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: చైత్ర అమావాస్యను పురస్కరించుకుని గురువారం రత్నగిరిపై దుర్గామాతలు కనకదుర్గ, వనదుర్గ అమ్మవార్లకు ఘనంగా హోమాలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు కనకదుర్గ అమ్మవారికి చండీహోమం, వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించారు. కాగా ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహిస్తున్న కనకదుర్గ అమ్మవారి చైత్రమాస ఉత్సవాలు చండీహోమంతో ముగిశాయి. వేదపండితులు సంతోష్ ఘనపాఠి, ఇంద్రగంటి నర్సింహమూర్తి, ముత్య సత్యనారాయణ, పాలంకి పట్టాభి, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమాలు జరిపారు. ఆలయ ఏఈఓ కృష్ణారావు, సూపరింటిండెంట్లు రమణ, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నేడు వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు హోమం నిర్వహిరని చెప్పారు. ఆసక్తి గల భక్తులు రూ.750తో టికెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొనాలని సూచించారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి గ్రామ శివారున అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై యువి శివనాగబాబు తెలిపిన వివరాల ప్రకారం... వీరలంకపల్లిలో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారనే ఫిర్యాదు మేరకు గురువారం ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో వెదురుపాకకు చెందిన పప్పల పద్మ అనే మహిళను అదుపులోకి తీసుకుని ఆమె నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించారు.

చిన్నారుల్లో ఆసక్తి గ్రహించాలి



చిన్నారులకు బహుమతులు అందజేసిన రోటరీ క్లబ్ అధ్యక్షురాలు శారద, డాక్టర్ అనుపమ, జాహ్నవి

బాలాజీచెరువు: రోటరీ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం రోటరీ హాల్లో నిర్వహించిన వెల్ బేబీ కాంటెస్ట్‌కు చిన్నారులు హాజరయ్యారు. పది నెలల వయసు నుంచి 18 నెలలు, 18 నెలల నుంచి మూడేళ్ల వయస్సుగా విభజించి పిల్లలకు వాకింగ్, ఫొటోజెనిక్ ఫేస్, స్మైల్, ఉంగరాల జుట్టు వంటి వాటిని పరిశీలించి బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ జాహ్నవి, ప్రముఖ పీడియాట్రిషియన్ డాక్టర్ టి.అనుపమ హాజరై ఇటువంటి వాటిల్లో తమ పిల్లలను పాల్గొనేలా ఆసక్తిగా తీసుకువచ్చిన తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. చిన్నారుల్లో ఆసక్తి గ్రహించి వారిని ఆ మేరకు ప్రోత్సహించాలన్నారు. సామాజిక సేవతో పాటు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్లబ్ అధ్యక్షురాలు సురభి శారదను అభినందించారు.

ముగిసిన తలుపులమ్మ జాతర మహోత్సవాలు



లోవకొత్తూరులో కొలువైన తలుపులమ్మ తల్లి

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి సంబరాలు గురువారంతో ముగిశాయి. ఈ నెల 9న అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభం కాగా బుధవారం రాత్రి జాగరణ నిర్వహించారు. గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఊరేగింపు, తీర్థం నిర్వహించారు. వివిధ దేవతామూర్తుల వేషధారణలు, కళాకారులు బళ్లవేషాలు, భీమవరం వారితో సంగీత విభావరి, నక్కపల్లి వారితో మ్యూజికల్ బ్యాండ్ ప్రదర్శించారు. గంధామావాస్య పర్వదినాలను పురస్కరించుకుని 12 రోజులు పాటు అమ్మవారి జాతరోత్సవాలు ఘనంగా నిర్వహించామని చైర్మన్ గొర్లి అచ్చియ్య నాయుడు, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ధర్మకర్తలు, లోవకొత్తూరు గ్రామస్తులు, రూరల్ పోలీసులు సహకరించారన్నారు. జాతరోత్సవాలు ముగియడంతో అమ్మవారి గరగలను గ్రామంలోని రామాలయంలో భద్రపర్చారు.



బళ్ల వేషాలను ప్రారంభిస్తున్న చైర్మన్, ఈఓలు

వైభవంగా నల్లకొండమ్మతల్లి జాతర

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో నల్లకొండమ్మతల్లి జాతర మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

చిల్లంగిలో గుబ్బాలమ్మ జాతర

కిర్లంపూడి: చిల్లంగిలో గుబ్బాలమ్మతల్లి జాతర మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా రూపులమ్మ అమ్మవారి జాతర



ఏలేశ్వరం రూపులమ్మ జాతరలో గరగనృత్యాలు

ఏలేశ్వరం: కోరిన కోర్కెలు తీర్చే స్థానిక రూపులమ్మ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. జాతరలో గరగ నృత్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉదయం పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టణంలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా శుక్రవారం అమ్మవారి తీర్థమహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మేడే విజయవంతం చేయాలి



సీఐటీయూ కార్యాలయంలో మేడే కరపత్రాలను ఆవిష్కరించిన నాయకులు

సామర్లకోట: మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు కరణం ప్రసాదరావు పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మేడే కార్యక్రమాల కరపత్రలను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాసు జి.మేడపాడు గ్రామంలో మేడే కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు టి.నాగమణి, బాలం లక్ష్మి, దేవి, పద్మ, ఎస్‌కె ఫాతిమా, సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావు ఆరోగ్యం కోసం ప్రార్థనలు



మసీదులో ప్రార్థనలు చేస్తున్న కౌన్సిలర్లు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ నాయకుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తండ్రి దవులూరి సుబ్బారావు ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ గురువారం మసీదులో అధికార పార్టీ కౌన్సిలర్లు ప్రార్థనలు చేశారు. ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చి ప్రార్థనలు చేశారు. సుబ్బారావు ఇటీవల పాము కాటుకు గురైన విషయం తెలిసిందే. దీంతో నాలుగు రోజులుగా ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రి చికిత్స పొందుతున్నారు.

ఫ్రీ సీట్లకు 27 మంది ఎంపిక

సామర్లకోట: ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు సీట్లు ఇవ్వాలనే ప్రభుత్వ ఆదేశాల్లో భాగంగా మండల పరిధిలో రాబోయే విద్యా సంవత్సరంలో 27 మంది విద్యార్థులు ఒకటో తరగతిలో చేరడానికి ఎంపికయ్యారని మండల విద్యాశాఖాధికారి వై. శివరామకృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిని ఎంపిక చేసినట్టు తెలిపారు. వేట్లపాలెం కేరళ ఇంగ్లీషు మీడియం స్కూల్‌కు ఇద్దరు, సామర్లకోట ఆర్‌కే లిటిల్ బర్ద్స్ స్కూల్‌కు ఐదుగురు, పనసపాడులోని మేధ స్కూల్‌కు ఇద్దరు, పనసపాడు లిటిల్ హాండ్స్ స్కూల్‌కు ఒకరు, వీకే రాయపురం శ్రీనివాస స్కూల్‌కు ఒకరు, సామర్లకోట రవీంద్ర స్కూల్‌కు ఒకరు, మేరీ ఇమ్మాక్యూలేట్‌కు ఒకరు, ప్రతిభ స్కూల్‌కు నలుగురు, విద్యా వికాస్‌కు ఒకరు, గౌతమ్ స్కూల్‌కు ఆరుగురు, లిటిల్ యాంజిల్ స్కూల్‌కు ఒకరు, శ్రీవిజ్ఞాన్‌కు ఒకరు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 25 లోపు ఆయా పాఠశాలకు వెళ్లి విద్యార్థుల సర్టిఫికేట్లు అందజేయాల్సి ఉంటుందని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులోని టిడ్కో హౌసింగ్ కాలనీ వద్ద ఉన్న విద్యుత్తు సబ్‌స్టేషన్ మరమ్మతులను పురస్కరించుకుని ఆ రోడ్డులో విద్యుత్ సరఫరాకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ జి.ప్రసాద్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పువారి సత్రం, టిడ్కో కాలనీ, లంకలపల్లి, రాందాస్ చేపల చెరువు, పిఠాపురం రోడ్డులోని ఇండస్ట్రీస్‌కు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించాలన్నారు.

క్యారెక్టర్ ఆర్టిస్ట్ గుణశేఖర్‌కు నంది అవార్డు



హైదరాబాద్‌లో బంగారు నంది అవార్డు అందుకున్న గుణశేఖర్

తొండంగి: సినిమా, సీరియల్స్‌లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణిస్తున్న ఒంటిమామిడి పంచాయతీ తాటియాకులపాలెం గ్రామానికి చెందిన కొమ్మోజు గుణశేఖర్ జాతీయ బంగారు నంది అవార్డు పొందారు. హైదరాబాద్‌లోని హరిహర కళామందిరంలో ఇటీవల ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ రంగాలకు చెందిన కళాకారులకు జీసీఎస్ సౌజన్యంతో బంగారు నంది అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కొమ్మోజు గుణశేఖర్ సూక్ష్మకళాఖండాలను రూపొందించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు తదితర అవార్డులు సాధించారు. కాగా గుణశేఖర్ ఆర్‌ఎక్స్ 100, వెంకీ మామ, అలవైకుంఠపురం, ఆచార్య వంటి సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించారు. ఈ నేపథ్యంలో వల్లూరి ఫౌండేషన్ గుణశేఖర్‌కు బంగారు నంది అవార్డును ప్రదానం చేసింది. అవార్డు పొందిన గుణశేఖర్‌ను ఏపీ తెలుగు భాషా సాంస్కృతిక అకాడమీ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి అభినందించారు.